క్లుప్తంగా

'ఆరోపణల్ని ప్రజలు నమ్మరు'

లింగాల: మండలంలో కొత్తగా ఏర్పడిన కొత్తచెర్వుతండా పంచాయతీలో ఎలాంటి అభివృద్ధి కాలేదని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు సర్పంచ్ మొగిలి మల్లేష్ తెలిపారు. శనివార తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న పీర్లచావిడి ప్రారంభానికి వచ్చిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే, బీఆర్ఎస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. తండాలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చేయూతతో రూ.30 లక్షలు ఖర్చు చేసి సీసీ రోడ్లు, ఇటీవల రూ.కోటికి పైగా నిధులతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారని తెలిపారు. ఇంటింటికి తాగు నీరు అందుతుందని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎంపీపీ

తాడూరు: మండల ఎంపీపీ శ్రీదేవి రెండు నెలల పాటు విదేశీ ప్రయాణానికి వెళ్లి శనివారం తిరిగి బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్న శివలీల బాధ్యతలు అప్పజెప్పినట్లు ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు.

ఇబ్బందులకు గురిచేయొద్దు



తాడూరు: మండల కేంద్రంలోని మత్స్యకార సంఘం భవనం ఆవరణలో మత్స్యకార సంఘం నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలోని గోవిందాయిపల్లి పెద్ద చెరువుపై 2021లో ముదిరాజ్‌లకు పూర్తి హక్కులతో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఏర్పడిందన్నారు. గ్రామంలో కొంత మంది చేపలు పట్టుకుంటామని ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దౌర్జన్యం చేయడంతో పాటు సంఘం సభ్యులను బెదిరిస్తున్నారన్నారు. చర్యలు తీసుకోకపోతే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అల్లాజీ, సహదేవుడు, హరికృష్ణ, తిరుపతయ్య, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించుకోవాలి

వెల్దండ: మండలంలో శనివారం హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపుల మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా ఏపీఓ ఈశ్వర్ మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ వర్షాకాలంలో 1.26లక్షల మొక్కలు లక్ష్యం ఉన్నట్లు పేర్కొన్నారు. 50శాతం మొక్కలను నాటించామన్నారు.

తీరిన తాగునీటి సమస్య



వెల్దండ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో బోరుమోటర్ మరమ్మతుకు గురికావడంతో విద్యార్థులకు తాగునీరు సమస్య ఏర్పడింది. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో కొత్త బోరు మోటార్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దశరథ్‌నాయక్, పంతునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తులు

బల్మూర్: ఉపాధి హామీ పథకం ద్వారా 2023–24 సంవత్సరంలో పండ్ల తోటల పెంపకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సువర్ణ శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, 2.5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులు అర్హులని తెలిపారు. పట్టా పాసుబుక్, బ్యాంకు అకౌంట్, ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్ కార్డు, పాన్‌కార్డు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జిరాక్స్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు జిరాక్స్‌లను గ్రామ కార్యదర్శికి సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 31 వరకు ఉందని రైతులు గమనించాలని కోరారు.

పల్కపల్లిలో శ్రమదానం

అచ్చంపేట రూరల్: మండలంలోని పల్కపల్లిలో శనివారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణతో పాటు వీధులను శుభ్రం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. సంస్థ సిబ్బంది ఇస్మాయిల్, పెద్దులు, సురేష్‌గౌడ్, హుస్సేన్, చంద్రశేఖర్, చందన, రోజా, రాణి పాల్గొన్నారు.

సారా పట్టివేత

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన సంతోష నాటుసారా విక్రయిస్తుండడంతో శనివారం పోలీసులు పట్టుకుని నమోదు చేశారు. 5లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు జాబితా

తెలకపల్లి: బీఎల్‌ఓలకు శనివారం మండల మహిళా సమాఖ్య భవనంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఫాం-6లో కొత్త ఓటర్లను నమోదు చేయాలని, ఫాం-7లో మరణించిన వారి వివరాలను, 8లో ఓటర్ లిస్టులో తప్పొప్పులను చిరునామ, పేర్లు వంటివి సరిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు కూడా తమ విధిగా గ్రామాలలో ఉన్న వారికి అవగాహన కల్పించాలని, అందరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా చైతన్య పరిచాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ భాస్కర్, డీటీ రాజేందర్‌రెడ్డి, గోపిసింగ్, నయాబ్ తహసీల్దార్ లక్ష్మణ్, ఆర్ఐలు రామస్వామి, శ్రీనివాసరావు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఓటర్ జాబితాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. మండలంలో మొత్తం 35 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. యువతి, యువకుల అర్హులందరికి ఓటుహక్కు కల్పించాలన్నారు. ఓటర్ లిస్టులో మరణించిన వారి పేర్లు, రెండుసార్లు వచ్చిన వారిపేర్లను తొలగించాలన్నారు.



తెలకపల్లిలో బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

ఆర్డీఓకు ఘన సన్మానం

తహసీల్దార్ కార్యాలయానికి మొదటి సారిగా వచ్చిన ఆర్డీఓ శ్రీనివాసులుకు తహసీల్దార్ రవికుమార్, డీటీ శ్రీను శాలువాలతో సన్మానించారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని యంగంపల్లి శనివారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎం మిషన్‌లను ఉపయోగించే విధానాన్ని ఎన్నికల అధికారులు ప్రజలకు వివరించారు. అనంతరం జిల్లెల్లా గ్రామంలో ఓటర్లకు అవగాహన కల్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

లింగాల: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై సర్పంచ్, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ లింగమ్మ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో అపరిశుభ్రత చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. డెంగీ బారిన పడకుండా ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు ఎజెండాలో పొందుపర్చిన అంశాల వారీగా ఆయా శాఖల వారు నివేదికలను వినిపించారు. ఖరీఫ్‌కు సంబంధించి అన్ని రకాల ఎరువులు యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు డీలర్లు, సింగిల్ విండో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని ఏఓ నాగార్జునరెడ్డి సభ్యులకు తెలియజేశారు. వచ్చే నెల 21వ తేదీ వరకు కొత్త ఓటర్ల నమోదుకు గడువు ఉందని, ప్రజాప్రతినిధులు సహకరించాలని తహసీల్దార్ మునిరోద్దీన్ తెలిపారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సభ్యులు కోరారు. ఈ విషయంలో ఏఈ అప్పలనాయుడు మాట్లాడుతూ సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూస్తామన్నారు. మండలంలో రూ.కోటికి పైగా విద్యుత్ బకాయిలు ఉన్నాయని, వినియోగదారులు చెల్లించేలా అవగాహన కల్పించాలని ఏఈ తెలిపారు. పాఠశాలలు, వసతి గృహాలలో నాణ్యత లోపించిన ఆహారం ఇస్తున్నారని కొత్తచెర్వుతండా సర్పంచ్ మల్లేష్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండే చిన్నారులకు ఎలాంటి అక్షర జ్ఞానం కలగడం లేదని, కేంద్రాలలో చాలా వరకు వయస్సు పైబడిన వారు ఉండడంతో బోధనను సక్రమంగా చేపట్టడం లేదని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశానికి ఆర్టీసీ, ఎక్సైజ్, అటవీ శాఖకు చెందిన వారు గైర్హాజరయ్యారు. సమావేశంలో వైస్ఎంపీపీ నారాయణగౌడ్, ఎంపీడీఓ గీతాంజలి, నీటి పారుదల శాఖ డీఈ ప్రియాంక, ఎంఈఓ చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ లింగమ్మ

'ఉపాధి'లో రూ.1.29 లక్షల దుర్వినియోగం

వెల్దండ: జాతీయ ఉపాధి హామీ పథకంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారందరూ తిరిగి చెల్లించాలని సోషల్ ఆడిట్ విజిలెన్స్ జిల్లా మేనేజర్ రాజు సూచించారు. శనివారం మండల ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 12వ సామాజిక తనిఖీలో మండలంలో మొత్తం రూ.1.29లక్షలు దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిపారు. టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఆపరేటర్లు, కార్యదర్శులతో రీకవరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా పంచాయతీలకు చెందిన వారీగా నిధులను రికవరీ చేసి రాష్ట్ర కమిటీకి జమచేస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు రూ.63వేలను రికవరీ చేసి కమిషనర్ రూరల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్ ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్, టీఏలు తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు అండగా కాంగ్రెస్



పెంట్లవెల్లి: రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రాగానే మత్స్యకారులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని చౌట చెరువులో చేపలు పడుతున్న మత్స్యకారులతో ముచ్చటించారు. ఖచ్చితంగా రానున్న ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని మత్స్యకారులకు కావాల్సిన చేయూత అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడితే నష్టం

లింగాల: పంటకు కావాల్సినంత ఎరువుకన్న అధికంగా వాడితే నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండలంలోని సూరాపూర్ శివారులో వానాకాలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఎకరాకు 2 లేదా 3 సంచులు వాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇలా వాడడం వలన పంటకు చీడపీడల బెడద అధికమవుతుందని తెలిపారు. ఎకరాకు 45 నుంచి 60 కిలోలు మాత్రమే వాడాలని సూచించారు. పంట సాగు చేసి 10 నుంచి 15 రోజులు మాత్రమే కావస్తుందని, ఈ దశలో ఎక్కువ మోతాదులో ఎరువులను వాడితే పంట తట్టుకోలేదని వివరించారు. పంట పూత దశలో ఎకరాకు 35 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేయాలని రైతులకు అవగాహన కల్పించారు.



సూరాపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

మహాసభను జయప్రదం చేయండి

అచ్చంపేట రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం ఆగస్టులో చేపట్టే మాదిగల విశ్వరూపం మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా కన్వీనర్ సోట కాశీం అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ 2014లో అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. వర్గీకరణ చేయకుండా మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాశీం, మహేష్, ప్రవీణ్, ఆంజనేయులు, వెంకటేష్, రాంప్రసాద్, నిరంజన్, భరత్, పవన్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇసుక అక్రమ రవాణా అడ్డుకోండి



తాడూరు: మండలంలోని దుందుబీ నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను అరికట్టాలని శనివారం తహసీల్దార్ మహమూద్ అలీకి కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఎటిధారిపల్లి నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నారని, వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నర్సింహ, రఘు, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

చారకొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, సమీప పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మర్రిపల్లి, చంద్రాయన్‌పల్లి సర్పంచ్‌లు నరేష్‌నాయక్, వసంత ప్రజలను కోరారు. శనివారం ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు పర్యటించారు. ప్రజలు వీధుల్లో చెత్తను వేయరాదన్నారు. విష జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

జొన్నపంట పరిశీలన



పెద్దకొత్తపల్లి: వానాకాలంలో సాగు చేసిన జొన్న పంట కోత ప్రయోగం కోసం మండలంలోని మరికల్‌ను ఎంపిక చేసినట్లు ఏఈఓలు రాధ, ముజీబ్ తెలిపారు. మరికల్ గ్రామాన్ని శనివారం వారు సందర్శించి జొన్న పంట సాగును పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంట కోత ప్రయోగం చేయడం ద్వారా పంట దిగుబడి అంచనా వేయవచ్చని తెలిపారు. గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు.

మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు దహనం చేశారు. ముస్లిం, మైనార్టీలను కించ పర్చేలా వ్యాఖ్యలు చేశారన్నారు. దీనికి ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మైనార్టీలకు రూ.లక్ష రుణాలు ఇస్తామని ప్రకటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శులు ఖాదర్‌పాష, సిరాజుద్దీన్, బాలపీరు, యూనిస్‌ఖాన్, హుస్సేన్, సయ్యద్‌పాషా, గులాం రసూల్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్‌లో బీజేపీ జెండా ఎగరేస్తాం



పెంట్లవెల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

పెంట్లవెల్లి: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరేస్తామని నాయకులు అన్నారు. శనివారం మండలంలో కొండూరు, తడకలతండాలో ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అధికారంలో లేనప్పుడే నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు అధికారంలోకి వస్తే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. పంట పొలాలలో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ముచ్చటించారు. కార్యక్రమంలో ఖలీల్, వెంకటేష్, విష్ణు, చందు తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ఎల్లూరులో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

మణిపూర్ ఘటన అనాగరికం



అచ్చంపేట రూరల్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన అనాగరికమని అంబేడ్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆనంద్, ప్రభాకర్, జానయ్య, జగన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కల్వకుర్తిలో బైక్ ర్యాలీ

కల్వకుర్తిరూరల్: మణిపూర్‌లో మానవహక్కుల ఉల్లంఘనను నిరసిస్తూ శాంతి స్థాపించేయాలని శనివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంటనే అల్లర్లు అరికట్టి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాండయ్య, మల్లయ్య, వెంకటేశ్వర్లు, నెహ్రూప్రసాద్, శ్రీనివాసులు, ఆంజనేయులు, జంగయ్య పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే సహించం

కల్వకుర్తిరూరల్: దళితుల మధ్య రాజకీయ పార్టీలు చిచ్చు పెట్టిన మాలలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు రావుల శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిగృహంలో మాలమహానాడు ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాదిగలకు ఎక్కడా అన్యాయం చేయలేదున్నారు. చర్మకార వృత్తి చేసే మాదిగలకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొందే అవకాశం ఉందని, మాలలకు ఆ అవకాశం లేదన్నారు. 2004లో సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని కొట్టివేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీలను పునర్వర్గీకరించే అధికారం లేదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వర్గీకరణకు సానుకూలం అని చెప్పడం విచారకరమన్నారు. కార్యక్రమంలో భారతి, మురళీ, శేఖర్, ఝాన్సీ, మంగ, పావని, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



బీసీ కాలనీలో కనీస వసతులు కరువు

నాగర్‌కర్నూల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బీసీ కాలనీలో కనీస వసతులు లేక చిన్నపాటి వర్షాలకు రోడ్లన్నీ బురదమయంగా మారాయని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ అన్నారు. శనివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే నిర్వహించారు. 20ఏళ్ల క్రితం ఏర్పడిన బీసీ కాలనీలో కనీసం సీసీ రోడ్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీలు నిర్మించినా ఉపయోగంలో లేవని ఆరోపించారు. తాత్కాలికంగా మట్టి పోయించాలని, అనంతరం సీసీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, నర్సింహ, రాములు, జహంగీర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేటవాసికి డాక్టరేట్



అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన టి.సురేష్ కుమార్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనపై అధ్యయనం – రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పరిధి' అనే అంశంపై రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హనా ఆనంద్‌రాజ్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. దీంతో సురేష్‌కుమార్‌కు 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సులభతరంగా పాఠాలు ఎలా బోధించాలో పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్ రూపొందిస్తున్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



బల్మూర్‌లో మాట్లాడుతున్న నాయకులు

బల్మూర్: పంచాయతీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సమ్మె శిబిరాన్ని ఆయన శనివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మెతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉన్నా ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం తగదన్నారు. కార్యక్రమంలో ఖదీర్, చంద్రమౌళి, వెంకటయ్య, గణేష్, శంకర్‌నాయక్, శంకర్, కొండయ్య, ముస్తఫా, రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

తెలకపల్లి: జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ అన్నారు. పంచాయితీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన నిరవదిక సమ్మె శనివారానికి 17వ రోజుకు చేరింది. సిబ్బందిని వెంటనే క్రమబద్ధీకరించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సైదులు, వెంకటయ్య, అక్కమ్మ, బాలకిష్టమ్మ, మైసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మెను కొనసాగించారు. సంఘం అధ్యక్షుడు బాలస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రతి కార్మికుడికి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, చంద్రయ్య, శ్రీనివాసులు, రామన్‌గౌడ్, మహేష్, ఆనంద్, ఈశ్వరమ్మ, శంకరమ్మ, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలకపల్లిలో నినాదాలు చేస్తున్న కార్మికులు



కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్, అశోక్‌నాయక్, బాలస్వామి, చంద్రమ్మ, సత్యం, ఆశన్న తదితరులున్నారు.

ఎస్‌ఐగా బాధ్యతలు

నాగర్‌కర్నూల్‌క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ మహేందర్ అన్నారు. అలంపూర్ నుంచి పట్టణానికి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసినడెస్‌ఐ విజయ్‌కుమార్ నారాయణపేటకు బదిలీపై వెళ్లారు.

బల్మూర్ ఎస్‌ఐగా శేఖర్‌రెడ్డి

బల్మూర్: మండల ఎస్‌ఐగా శేఖర్‌రెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రత విషయంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ శివానందంగౌడ్ గద్వాల జిల్లా ధరూరుకు బదిలీపై వెళ్లగా, అక్కడి నుంచి శేఖర్‌రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

ఆర్డీఓకు సన్మానం

కొల్లాపూర్: మంథనికి బదిలీ అయిన ఆర్డీఓ హనుమనాయక్‌కు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయ ఉద్యోగులతో పాటు, పలువురు నాయకులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా కొల్లాపూర్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజును వారు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, తహసీల్దార్ శివశ్రీనివాస్ పలువురు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలి

చారకొండ: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాల్సిన అవసరముందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేటీకరించి, దేశ సంపదను కొంత మంది కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతుందని మండిపడ్డారు. రూ.లక్షలు కోట్లు అప్పు చేసి దేశాన్ని దివాలా తీయించిందన్నారు. వారి వెంట అశోక్, బాలయ్య, నారాయణ్‌రెడ్డి, శ్రీను, వంశీ ఉన్నారు.